# పోలీస్ కుక్కలు

జాతశ్రీ



ఊరి చివరన వున్న - చివరి తరగతియిళ్ళ మధ్య ఏడేళ్ళ క్రితం పుట్టిన మనుమడు కోతి కొమ్మచ్చి ఆడేందుకు. ఆనాడు తను నాటిన రావి చెట్టు కొమ్మకు - కుశలయ్య తనంత తానే వురేసు కున్నాడో, లేక వేరెవరయినా వుసురు కట్టకున్నారో ఎవరికి తెలీదు.

ఎవరికీ తెలీని విషయం ఎవరైనా చర్చించుకో వచ్చు. ఎలాగైనా చర్చించుకోవచ్చు. చావడం, జీవించడం, వ్యక్తి యిష్టా యిష్టాలమీద ఆధార పడినా 'పబ్లిక్'గా చావడానికి, పుట్టడానికి ఎవరికీ హక్కు లేదు.

పబ్లిక్‌గా చచ్చిన కుశలయ్య పబ్లిక్ రంగంలో సంచలనం కలిగించాడు. ఎవరికి వారే వారి స్వాభి ప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడించారు. ఎంతో ఆలోచించాక ఎక్కువ మంది న్యాయమే చెప్పారు. కుశలయ్య వుసురు ఎవరూ కట్టుకోలేదు. అతణ్ణి వురేయాల్సిన అవసరం, అగా ఎవరికీ లేదు. వాస్తవం.!

తండ్రి వురేసు కున్నందుకు ఎర్రయ్య గుండెలు అవిసి పోయాయి. కోడలు రోషమ్మ ఏడుపు తన అధిక్యతను గుడిసెలోళ్ళకు చూపింది పాతాళగంగ లోంచి వుబుకుతున్న సీటిలా, రోషమ్మ ఏడుపుతో రవిక ముందుభాగం తడిసిపోయింది. ముక్కుతో పవిట నిండిపోయింది. ముగ్గురు పిల్లలూ కాకి అరు పుల్లా ఏడవసాగారు.

చెట్టుమీద గుండెలు వణికించేలా శవం, చెట్టు క్రింద గుండెలు కరిగించేలా రోదన. చాలామందికి ఏడుపు రప్పించింది. ఎందుకో, చచ్చిన కుశలయ్య ఎందరినో ఏడ్పించాడు. అయినా కుశలయ్య ఇక రాడు. శ్వాసించడు. అతనితో మనకు పేచీ లేదు.

* * *

ఎర్రయ్య ఏడుస్తున్న పెళ్ళాన్నీ, పిల్లల్నీ చూసి గుండె దిటవు చేసుకున్నాడు. చేయవలసిన తతంగా నికి పలుగూ, పారా తీసుకొని వల్లకాటికి సిద్ధ మయ్యాడు. అదే సమయంలో ఎదురయ్యాడు మాలీ పటేల్.

మాలీ పటేల్ గ్రామానికి అధికారి. గ్రామంలోని జనన మరణాలు అతను నమోదు చేస్తాడు. కలహాలు, కొట్లాటలు పరిష్కారం చేస్తాడు. మంచీ చెడ్డల ప్రతినిధిగా అతని హోదా నిలువైనది.

పంచాయతీ జరగనిదే శవాన్ని కదల్చకూడ దన్నాడు. కదిలిస్తే కలిగే నష్టం చెప్పాడు. పోలీసులు వచ్చేదాకా ఆగమన్నాడు మాలీపటేల్.

"పోలీసులెప్పుడొస్తారో, ఏమో ... యింతలకే ముసలోడు వాసనెట్టిండు." అన్నాడో గుడిసెల పెద్ద.

"అయితే నేనేం చెయ్యను?...రూలది." మాలీ పటేల్.

'ముసలోడ్ని వోరూ ఉరేయలె...తనయితయం గుడిశానికంతా తెల్సు...యింగపంచనామా ఏందీ ... ఏదోటి రాసుకోండి దొరా ... "అన్నాడు మరొకడు.

"అలా చెపితే యస్. ఐ. వూరుకుంటాడా ... జైల్లో నెడ్తారు. "ఎవర్ని?" అన్నాడు బెరుగ్గా చూస్తూ.

పటేల్ ఎర్రయ్యని అమాయకుణ్ని చూసినట్టుగా చూసి, సున్నితంగా నవ్వాడు.

ఆ నవ్వు అదోలా అన్పించింది ఎర్రయ్యకు. శరీరంలో వణుకు ఆరంభమయింది. నక్కుతున్న స్వరంతో..." నన్నా...ఎందుకూ? ... మయ్యాను నేనురేస్నా?..." అన్నాడు.

"వురేసి చంపావో, చంపి వురేశావో, నాకేం తెలుసు? పోలీసులు రావాలి .."

పోలీసులనేసరికి ఎర్రయ్య నిరుత్తరుడై పోయాడు. గుండెలు భయంతో కంపించాయి. మనసు పరిపరివిధాల పోయింది.

పోలీసులంటే ఎర్రయ్యకు సదభిప్రాయం లేదు. అన్యాయానికి ప్రతినిధులుగా భావిస్తాడు...నాలుగు సంవత్సరాల క్రితం-వూరిలో దొంగతనం జరిగి అను మానం మీద బేడీలేసిన సర్వయ్యను నిజం చెప్పే దాకా కొట్టారు. "చెప్పేది నిజమే" - అన్నందుకు చావగొట్టారు. చివరకా చావుదెబ్బలు తినలేక అబద్ధం చెప్పాడు. దొంగతనం చేసినట్టు వొప్పు కున్నాడు. సర్వయ్యను జైల్లో వేశారు. వాడి పెళ్ళానికి రోజులు కష్టమైపోయాయి. తన నలుగురి పిల్లల ఆకలిబాధ చూళ్ళేక మానాన్ని అమ్ముకుంది." యీ 'మాన'మే లేకపోతే నా పిల్లల గతేంకాను?.." అంటూంది సర్వయ్య భార్య. నిజమే...!

అయినా... ఛీ... ఛీ...

పోలీసులువస్తే తనకూ... దొంగోడి చేవలు

